క్లుప్తంగా

ఓటు ఉన్న రైతుల వివరాలు ఇవ్వాలి



వివరాలు తెలుపుతున్న సి.బెళగల్ సొసైటీ సీఈఓ రవికుమార్‌రెడ్డి

సి.బెళగల్: స్థానిక వ్యవసాయ పరపతి సంఘంలో (సొసైటీలో) ఓటు హక్కు ఉన్న రైతులు వివరాలు కార్యాలయంలో అందజేయాలని సీఈఓ రవికుమార్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. సొసైటీలో ఓటు ఉన్న రైతులందరూ తమ వివరాలను ఇవ్వాలన్నారు. రైతుల పొలం పాసుపుస్తకం, ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలు, మూడు పాస్ ఫోటోలను కార్యాలయంలో వచ్చే సోమవారం (ఈనెల 24వ తేదీ) లోగా సమర్పించాలని సూచించారు. వివరాలకు 9666580100 సెల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



విద్యార్థులకు నీటి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాణ్యం : విద్యార్థి దశ నుంచే నీటిని పొదుపుగా వాడుకునే అలవాటు చేసుకోవాలని సచివాలయం-2 గ్రామ కార్యదర్శి ప్రవీణ్, ఇంజినీర్ అసిస్టెంట్ మౌలాలి అన్నారు. గురువారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలనుగుణంగా నీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. కావున నీటి వృథా చేసే వారికి విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాక పర్యావరణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొక్కలు నాటి వాటి సంవరక్షణకు చర్యలు తీసుకునే బాధ్యత విద్యార్థుల్లో ఉండాలన్నారు. అనంతం నీటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మేరీ సులోచన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చేరిన స్టూడెంట్ కిట్లు



కిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం

పాణ్యం: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థి కిట్లు మండల కేంద్రానికి వచ్చాయని ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యంలు తెలిపారు. గురువారం పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిట్లను నిల్వ చేశామన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థికి కిట్లు మంజురు అయ్యాయన్నారు. మండలానికి సంబంధించి 4725 మందికి కిట్లు వచ్చాయన్నారు. వీటిని త్వరలోనే విద్యార్థులకు అందజేస్తామన్నారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, షూ, డిక్షనరీలు, ఇతర సామగ్రి వచ్చాయన్నారు.

నీట్ పరీక్ష మరలా జరపాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పాణ్యం : దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష మరలా నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పాణ్యంలోని ప్రభుత్వ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్ మాట్లాడుతూ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. పరీక్షల్లో అవకతవకలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతున్న ఇలాంటి మాఫియాను కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో గణేష్, విగ్నేష్, రాజు, నగేష్, కార్తీక్, వేణు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంత్రిది అవగాహనారాహిత్యం

కర్నూలు(సెంట్రల్): ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటలకు అనుసంధానం చేస్తూ తొలి సంతకం చేసిన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌ది అవగాహనారాహిత్యమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వీరశేఖర్, కేవీ నారాయణ గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. డబ్బున్న వారే పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారని, అలాంటప్పుడు ఉన్నత వర్గాలే ఎక్కువగా లాభం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంపై మరోసారి మంత్రి ఆలోచన చేయాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి
- కాల్వబుగ్గలో మొక్కలు నాటే కార్యక్రమం

ఓర్వకల్లు : మొక్కలు నాటుదాం..పర్యావణాన్ని కాపాడుదామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాల వద్ద 'ప్లాంట్ ఏ ట్రీ ఛాలెంజ్'లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా రోజురోజుకు కాలుష్యం కోరలు చాస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పోషించినప్పుడే మానవుని మనుగడ సాధ్యమవుతుందన్నారు. వర్షాలు సక్రమంగా కురవాలంటే మొక్కలు పెంచడం తప్పనిసరి అని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో కలిపి 'వర్షాకాలం వచ్చింది.. మొక్కలు నాటుదాం' అనే నినాదంతో 10 వేల మొక్కలు నాటాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అదే లక్ష్యంతో మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో సుమారు 4,885 మొక్కలు నాటినట్లు వెల్లడించారు. గ్రామాలలో ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, ఏపీడీ లక్ష్మన్న, సీఎల్‌ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, ఏపీఓ కుమార్‌సాయినాథ్, సర్పంచు పెద్ద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కాల్వబుగ్గలో మొక్క నాటి నీరు పోస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

కల్లూరు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కల ప్రాముఖ్యత గురించి, అడవులు పరిరక్షణ, నీటి పొదుపు, నీటి పరిరక్షణ గురించి వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దేశ్వరమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉలిందకొండలో మొక్కలు నాటి నీరు పోస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు

శ్రీమఠంలో 'సీతా కల్యాణ వైభోగమే' చిత్ర యూనిట్

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై 'సీతా కల్యాణ వైభోగమే' చిత్ర యూనిట్ సభ్యులు గురువారం మంత్రాలయంకు విచ్చేశారు. సినీ నిర్మాత రాచల యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నటీనటులు సుమన్ తేజ్, గరీమ చౌహన్, దేవరాజ్, పాలమూర్ మురళీధర్ గౌడ్, రమణా రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సాగర్ వచ్చారు. శుక్రవారం సీతా కల్యాణ వైభోగమే చిత్ర రిలీజ్‌ను పురస్కరించుకుని రాఘవేంద్ర స్వామి వారి దర్శనార్థం వచ్చినట్లు వారు తెలిపారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనానికి చేరుకుని పూజలు చేశారు. సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



శ్రీమఠంలో సినీ నటులు

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పొదుపు మహిళలతో బ్యాంక్ ప్రతినిధులు

ఓర్వకల్లు: కెనరా బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు తిరుపతి ప్రాంతీయ కార్యాలయం జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయ్య కోరారు. గురువారం కెనరా బ్యాంక్ ప్రతినిధుల బృందం స్థానిక కెనరా బ్యాంక్‌ను సందర్శించారు. అనంతరం పొదుపు మహిళల సౌజన్యంతో నిర్వహిస్తున్న బాలభారతి పాఠశాలను సందర్శించి పాఠశాల అభివృద్ధిని గురించి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఓర్వకల్లు బ్రాంచి పరిధిలోని ఓర్వకల్లు, ఎన్.కొంతలపాడు, గుట్టపాడు, పాలకొలను, కన్నమడకల గ్రామాలకు చెందిన 223 గ్రూప్‌లకు సంబంధించి సుమారు 2500 మంది సభ్యులకు రూ.25 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఈ ఏడాది రూ.కోటి రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. మండల మహిళా సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి మాట్లాడుతూ.. పొదుపు మహిళలు బ్యాంక్‌లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కర్నూలు రీజినల్ మేనేజర్ సుషాంత్‌కుమార్ మాట్లాడుతూ.. అర్హత గల ప్రతి గ్రూప్‌నకు మొదట రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణసదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు బ్యాంక్‌లో అకౌంట్ లేని వారు అకౌంట్ తెరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధుల బృందం, డీఎం గౌతమ్, నరేష్, బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): పదవ తరగతిలో ప్రతిభ చూపిన పేద, ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకోవాలని అంజుమన్ ఇస్లామియా అధ్యక్షుడు అబ్దుల్ కుద్దూస్ గురువారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.3వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్నామని, పట్టణ వాసులై ఉండి ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంజుమన్ కార్యాలయంలో జూలై 15వ తేదీలోగా అందజేయాలని సూచించారు. ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల జిరాక్స్ కాపీలు, కళాశాలలో చదువుతున్నట్లు ధ్రువపత్రాలు దరఖాస్తుకు జగపరచాలని, పూర్తి వివరాలకు 9866242742 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): క్రాంతినగర్‌లో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీఎస్ మల్లికార్జునప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9 తరగతిలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈనెల 22వ తేదీలోగా స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

సామూహిక వివాహాలు చేయడం గొప్ప విషయం

కర్నూలు(సెంట్రల్): పేద ముస్లిం యువతీ, యువకులకు సామూహిక వివాహాలు చేయడం గొప్ప విషయమని స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ సబిహా పర్వీన్ అన్నారు. గురువారం నగరంలోని జీబీ ఫంక్షన్ హాలులో అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లిం మైనార్టీ యువతీ, యువకులకు వివాహాలు చేశారు. కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. గతంలో ఆల్ హాజ్ అబ్దుల్ గఫూర్ అండ్ ఖమ్రున్నిషాబేగం పూర్ గరల్స్ మార్యేజెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహించేవారన్నారు. వారి మరణానంతరం ఆ బాధ్యతను అవాజ్ కమిటీ తీసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం నాయబ్ సయ్యద్ సలీంపాషా వివాహాలు జరిపించారు. ప్రతి జంటకు అవాజ్ కమిటీ తరపున కానుకలు అందజేశారు. కార్యక్రమంలో అవాజ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్, మదీనా కాలేజీ కరస్పాండెంట్ ఎం.మహ్మద్ పాషా పాల్గొన్నారు.



కొత్త జంటలకు ఇవ్వనున్న కానుకలను పరిశీలిస్తున్న స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ సబిహా పర్వీన్

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలి

గూడూరు రూరల్: పదో తరగతి పాసైన విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ కోరారు. గూడూరులోని ఇంటర్ కాలేజీలో విద్యార్థులు చేరాలని గురువారం అధ్యాపకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశానికి సంబంధించి అడ్మిషన్ల కోసం పదో తరగతి పాసైన విద్యార్థులకు ఇళ్లకు వెళ్ళి కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, వసతులు, ల్యాబ్‌లు, 2024 ఫలితాల్లో విద్యార్థులు సాధించిన ప్రతిభ గురించి వివరించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు కూడా రానున్నాయని, ఉద్యోగ అవకాశాలపై గైడెన్స్‌తో పాటు అవసరమైన కోచింగ్‌ను కూడా అందిస్తున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకునేందుకు కళాశాలలో చేరాలని ఆయన తెలపారు.



విద్యార్థినికి కరపత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్

పంచేంద్రియాల్లో కళ్లు ప్రధానమైనవి

కర్నూలు(సెంట్రల్): పంచేంద్రియాల్లో కళ్లు ప్రధానమైనవని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్వో కె.మధుసూదన్ రావు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయ ఆవరణలో శాంతిరాం కంటి ఆసుపత్రి, కేవీ సుబ్బారెడ్డి కళాశాల, రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు ఉచితంగా కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులు అతి ముఖ్యమైన వారని, వారి సంక్షేమానికి స్వచ్ఛంద సంస్థలు ముందు రావాలన్నారు. పని ఒత్తిడిలో ఆరోగ్యం కోసం తగిన సమయాన్ని కేటాయించుకోవాలని ఆయన జర్నలిస్టులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్ శర్మ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఐపీఆర్వో దివాకర్, పాత్రికేయుడు మీసాల రామస్వామి పాల్గొన్నారు.



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

నూర్‌బాషా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కదిరి దస్తగిరి



కదిరి దస్తగిరికి నియామక పత్రాన్ని అందజేస్తున్న షేక్ సయ్యద్ బాజీ

చాగలమర్రి: రాష్ట్ర నూర్‌బాషా దూదెకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కదిరి దస్తగిరి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం చాగలమర్రిలోని కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాజీ నియామక పత్రాలను కదిరి దస్తగిరికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో దూదెకుల సామాజిక వర్గం సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సోషియల్ మిడియా ఇన్‌చార్జ్ హుసేన్, జిల్లా ప్రధానకార్యదర్శి డి.దస్తగిరి, నియోజకవర్గ అధ్యక్షుడు దస్తగిరి, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు షేక్ ఉమర్ షరీఫ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ షేక్ నసీరుద్దీన్, చాగలమర్రి మండల అధ్యక్షు డు జింకల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుకు అదను దాటలేదు

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు సమయం దాటిపోలేదని రైతులు ఆందోళన చెందనవసరం లేదని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత సూచించారు. వారు గురువారం మండలంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి పంటను సాగుచేసే రైతులు 125 రోజుల కన్నా తక్కువ సమయంలో పంట చేతికి అందే రకాన్ని సాగుచేసుకోవాలని, నేరుగా విత్తు పద్ధతిపై శ్రద్ధ వహించాలన్నారు. అలాగే జూలై 20వ తేదీ వరకు పత్తి పంటను సాగు చేసుకోవచ్చునని తెలిపారు. తేలిక నేలల్లో 50-60 మీ.మీటర్లు, బరువు నేలల్లో 60–75 మీ.మీ వర్షపాతం నమోదైన తరువాతనే పత్తి సాగుచేసుకోవాలన్నారు. పత్తిలో అంతర్ పంటగా కందిని సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు. సరైన యాజమాన్య పద్ధతుల ద్వారా ఆగస్టు 15వ తేదీ వరకు కందిని సాగు చేసుకోవచ్చని తెలిపారు. మొక్కజొన్న పంటను జూలై 15వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చన్నారు. పెసర, మినుములను జూలై 15వ తేదీ వరకు ఆరుతడి పంటలైన ఆముదం, పొద్దుతిరుగుడు, ఉలువలను జూలై 31వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



గోనెగండ్లలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఫ్యాన్ల వితరణ

కర్నూలు(అర్బన్): స్థానిక బీ క్యాంప్‌లోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహానికి ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను గురువారం విరాళమిచ్చారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు హెచ్‌డీ ఈరన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్యకు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. అనంతరం రూ.25 వేల విలువ చేసే 10 ఫ్యాన్లు, 15 ట్యూబ్ లైట్లను అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు జి.సురేంద్రనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ రిటైర్డు జేడీ కే చిన్న నారాయణ, నాయకులు పీ కరుణానిధి, ఎస్ కిష్టన్న, డా.డీ పుణ్యశేషుడు, వసతి గృహ సంక్షేమాధికారిణులు బీ బెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందిస్తున్న అసోసియేషన్ నేతలు

ఆర్చరీలో విద్యార్థిని ప్రతిభ



కియానా

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 15న నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని కియా నా ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థా యి పోటీలకు ఎంపికయ్యింది. గురువారం విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ జస్మిత్ కౌర్ షేకూన్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24 వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని చాంబర్‌లో యోగా క్రీడాకారులకు గురువారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జాతీయ యోగా సంఘం సంయుక్త కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కలిగిన యోగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యోగ సంఘం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిద్ధంగా ఉందన్నారు.

ఒలింపిక్ పరుగును విజయవంతం చేయండి

కర్నూలు (టౌన్): ఈనెల 22న నగరంలో చేపడుతున్న ఒలింపిక్ పరుగును విజయవంతం చేయాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ సూచించారు. గురువారం రాత్రి ఆయన తన నివాసంలో ఒలింపిక్ పరుగు టీషర్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ శనివారం నిర్వహించను ఒలింపిక్ పరుగు ఐదు ప్రాంతాల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ముంగిపు కార్యక్రమం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఉంటుందన్నారు. ఒలింపిక్ డేను పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



సి.బెళగల్లో రిటైర్డ్ వీఆర్వో సోమశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న తహసీల్దార్ అనుపమ



పాణ్యంలో విశ్రాంత ఉద్యోగి రాజయ్యను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

సి.బెళగల్: ప్రజలకు రెవెన్యూ అధికారులు అందించే ఉత్తమ సేవలతోనే గుర్తింపు సాధ్యమవుతుందని తహసీల్దార్ అనుపమ అన్నారు. గురువారం రెవెన్యూ డేను తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ.. జీవన భృతికి అవసరమైన సేవలు రెవెన్యూ శాఖ ద్వారానే ప్రజలు పొందుతునారన్నారు. రెవెన్యూ సేవలలో మీ భూమి వంటి విప్లవమాత్మక మార్పులు వచ్చాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో ఎక్కువ కాలం, ఎక్కువ గ్రామాల్లో వీఆర్వోగా సేవలందించి రిటైర్డ్ అయిన మాజీ వీఆర్వో సోమశేఖర్‌రెడ్డిని వారు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండలంలో ఉత్తమ సేవలందించి రెవెన్యూ అధికారులలో మండల గణాంక అధికారి (ఏఎస్ఓ) ఆదినారాయణ, సి.బెళగల్ వీఆర్వో శేఖర్‌లకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగభూషణం, గ్రామ పెద్ద సీబీ విష్ణువర్ధన్‌రెడ్డి, వీఆర్వోలు, రైతులు ఉన్నారు.

రెవెన్యూ సేవలను వినియోగించుకోవాలి

గూడూరు రూరల్ : ప్రతి ఒక్కరూ రెవెన్యూ సేవలను వినియోగించుకోవాలని తహసీల్దార్ ఉదయ్ సంతోష్ అన్నారు. గూడూరులోని కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు, రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను నిర్ణీత గడువులోగా అందిస్తున్నామన్నారు. అనంతరం గతంలో పని చేసి రిటైర్డు అయిన ఉద్యోగి జాకోబును శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు నాగేంద్ర, హరిరావు, ఖాజా హుసేన్, మంజీర, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి బాధ్యతగా చేయాలి

పాణ్యం : రెవెన్యూ శాఖలో పని చేసే ప్రతి ఉద్యోగి ఎంతో ఓర్పు, బాధ్యతతో పని చేయాలని తహసీల్దార్ ఫణి కుమార్ అన్నారు. గురువారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1786 జూన్ 20వ తేదిన బ్రిటిష్ వారు ప్రభుత్వ రెవెన్యూ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. ఈ శాఖ ద్వారా కోట్ల మందికి సేవలు అందిస్తున్నారమన్నారు. అనంతరం విశ్రాంత వీఆర్ఓ రాజయ్యను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, వీఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



గూడూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉదయ్‌సంతోష్



కేజీబీవీ విద్యార్థినులకు కిట్ అందిస్తున్న ఏపీసీ విజయ జ్యోతి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కల్లూరు : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సమగ్ర శిక్ష (అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్) ఏపీసీ విజయ జ్యోతి అన్నారు. గురువారం కల్లూరు మండలం లక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (మైనార్టీ)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీసీ విజయ జ్యోతి విద్యాలయంలో ఆరవ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తరగతి గదులో విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.